ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



7

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 2 ఫిబ్రవరి 2025

టీడీపీకి పీఠం పక్కా..!

అయినా పట్టు వీడని వైసీపీ

ఎమ్మెల్సీలకు ఓటుకోసం ప్రయత్నాలు

రసవత్తరంగా మారిన పురం చైర్మన్ ఎన్నిక



రేపు జరిగే మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు కౌన్సిల్‌హాల్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

హిందూపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు గడువు దగ్గర పడుతున్నకొద్దీ రెండు పార్టీలూ ఎత్తుకు పై ఎత్తు వేస్తున్నాయి. చైర్‌పర్సన్ ఇంద్రజ ఆరు నెలల క్రితం పదవికి, వైసీపీకి రాజీనామా చేయడంతో చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 3న చైర్మన్ ఎన్నిక నిర్వహించేలా ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. మున్సిపాలిటీలో టీడీపీకి మెజార్టీ సభ్యులు ఉన్నారు. అయినా చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోంది. టీడీపీ తమ సభ్యులను విహారయాత్రకు తీసుకెళ్లగా, వైసీపీ హిందూపురంలోనే ఉండి ఎత్తుగడలు వేస్తోంది. వైసీపీ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. ఇద్దరు ఎమ్మెల్సీలకు ఓటు హక్కు కల్పించాలని వైసీపీ నాయకులు అడుగుతున్నట్లు సమాచారం.

రసవత్తరం

చైర్మన్ ఎన్నికకు జనవరి 27న నోటిఫికేషన్ జారీ కాగానే రాజకీయం వేడెక్కింది. టీడీపీ క్యాంపులో ప్రస్తుతం 18 మంది ఉన్నారు. మరో ముగ్గురు నేడు శిబిరానికి చేరుకోనున్నారు. వైసీపీకి 17 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. వీరిలో కొందరు గైర్హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వైసీపీ ముఖ్యనేతలు కొంతమంది పెద్ద మొత్తంలో డబ్బులు ఆశ చూపుతున్నారని తెలిసింది. కానీ ఎన్నిక జరిగిన తరువాత ఇస్తామనడంతో ఎత్తులు పారడం లేదని సమాచారం. మునిసిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లు ఉన్నారు. చైర్మన్ పీఠం దక్కాలంటే 21 మంది సభ్యులు ఉండాలి. టీడీపీకి 21 మంది కౌన్సిలర్లతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే ఓటు కలిపి 23 ఓట్లు ఉన్నాయి. అయినా వైసీపీ పీఠం కోసం ప్రయత్నిస్తోంది.

ఎమ్మెల్సీలకు ఓటు హక్కు కోసం..

వైసీపీకి ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారు. వారికి పురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో ఓటు హక్కు పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దీనికోసం ఆ పార్టీ లీగల్‌సెల్ నాయకులు మున్సిపల్ అధికారులను సంప్రదించారని సమాచారం. మున్సిపల్ చట్టం ప్రకారం.. ఎమ్మెల్సీకి ఓటు హక్కు ఉండాలంటే.. ఎమ్మెల్సీ పదవి రాక మునుపే ఆ మున్సిపాలిటీలో ఎమ్మెల్సీకి ఓటు హక్కు ఉండాలి. కానీ ఇద్దరు వైసీపీ ఎమ్మెల్సీలకు పురంలో ఓటు హక్కులేదు. కాబట్టి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. అయినా వైసీపీ నాయకులు ఒత్తిడి చేయడంతో న్యాయనిపుణుల సలహా తీసుకోవాలని అధికారులు సూచించారని తెలిసింది.

రంగంలోకి ముఖ్య నేతలు

చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో వైసీపీ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. బెంగళూరులో నివాసముంటున్న వైసీపీ నేత హిందూపురం చేరుకుని కౌన్సిలర్లతో అంతర్గత సమావేశం నిర్వహించారని తెలిసింది. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ ఆదివారం హిందూపురానికి చేరుకుని, ఆ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించనున్నారు. వీరితోపాటు పులివెందులకు చెందిన ఓ నాయకుడు ఆదివారం హిందూపురానికి వస్తారని తెలిసింది. ఇప్పటికే వైసీపీ విప్‌ను తెరమీదకు తీసుకొచ్చింది. కానీ పార్టీమారినందుకు ఆరునెలల క్రితమే సస్పెండ్ చేసిన కౌన్సిలర్లకు ఇప్పుడు విప్ జారీ చేయడం చర్చనీయాంశం అయింది.

కాస్త ఉపశమనం..!

- ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం
- కిసాన్ క్రెడిట్ పరిమితి పెంపు
- సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు
- పట్టణ పేదలకు యూపీఐ లింక్డ్ క్రెడిట్ కార్డులు
- టర్మ్ లోన్ స్కీమ్‌తో ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణాలు
- రైల్వేకు గత ఏడాది కంటే తగ్గిన కేటాయింపులు
- కేంద్ర బడ్జెట్‌పై అధికార పక్షం మోదం.. విపక్షం పెదవి విరుపు

మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులకు ఊరట



పుట్టపర్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కొందరికి మోదం... మరికొందరికి ఖేదం కలిగించింది. ఆర్థికశాఖ మంత్రి హోదాలో నిర్మలా సీతారామన్ వరుసగా 8వసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.50 లక్షల కోట్లకు పైబడిన బడ్జెట్‌ను ఆమె ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ వెనుకబడిన అనంత ఉమ్మడి జిల్లాకు అరకొరగానే ప్రయోజనం చేకూర్చుతోందనే వాదనలు వినవస్తున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ప్రధానంగా మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులకు ఊరట లభించింది. రైతాంగానికి కిసాన్ క్రెడిట్ రుణ పరిమితి పెంపుతో కొంత లబ్ధి చేకూరింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో... ఇచ్చిన హామీల ఊసే లేకపోవడం... వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ నిధుల ప్రస్తావనే లేకపోవడం తీవ్ర నిరాశను కలిగించింది. జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయ భవన నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రూ. 498 కోట్లు అవసరం. అయితే దేశంలోని 37 సెంట్రల్ యూనివర్సిటీలకుగానూ వికసిత్ భారత్‌లో భాగంగా బడ్జెట్‌లో రూ. 5500 కోట్లు నిధులు కేటాయించారు. దాదాపుగా అనంత జిల్లాలోని సెంట్రల్ యూనివర్సిటీకి రూ. 200 కోట్ల నిధులు మంజూరు చేసే అవకాశాలున్నాయి. ఇక పట్టణ పేదలకు యూపీఐ లింక్డ్ క్రెడిట్ కార్డులతో (మిగతా 8లో..)

ఆనందదాయక బడ్జెట్



గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. రెక్కలు విరిగిన ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో అధిక కేటాయింపులు చేయడం ఆనందదాయకం. బడ్జెట్‌లో ఏపీకి అధిక నిధులు కేటాయించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు. బడ్జెట్‌లో వ్యవసాయం, పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పించేలా కేంద్ర బడ్జెట్ ఉంది. కేన్సర్ రోగులకు ఊరట కలిగించేలా జిల్లా ఆసుపత్రులో డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేయడం, ఆరు రకాల ఔషధాలపై పన్ను మినహాయించడం అభినందనీయం. ఏపీకి అధిక నిధులు కేటాయింపులో సీఎం కృషి ఎంతో ఉందన్నారు.

- సవిత, బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి

అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట



కేంద్ర బడ్జెట్‌లో అభివృద్ధి సంక్షేమానికి పెట్టపీట వేశారు. ప్రజానుకూల ప్రగతిశీల బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. కేటాయింపుల్లో రాష్ట్ర ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని సంక్షేమ పథకాలకు నిధులు పెంచారు. ఆదాయ పన్ను మినహాయింపు మధ్య తరగతి, ఉద్యోగులకు ఊరట కల్గించింది. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంటుకు బడ్జెట్లో కేటాయింపులు అభినందనీయం. ఏపీకి నిధులు ఎక్కువగా రావడం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఎంతో ఉంది.

- బీకే పార్థసారథి, ఎంపీ, హిందూపురం

ఏపీ అభివృద్ధికి సహకారం



ఈ బడ్జెట్ దేశ పురోభివృద్ధికి తోడ్పడే బడ్జెట్. పోలవరం ప్రాజెక్టుకు సవరించిన అంచనాలను కేంద్రం అమోదించడం ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప వరం. విమాన కనెక్టవిటీ లేని కొండప్రాంతాలు, ఈశాన్య ప్రాంతాల్లో ఉడాన్ పథకం కింద చిన్న చిన్న విమానాశ్రయాలు, హెలీప్యాడ్‌లు నిర్మించే పథకాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించడం సంతోషించతగ్గ విషయం. మధ్యతరగతి ప్రజలకు పన్నుల భారం తగ్గించడం హర్షణీయం. పన్నుల భారం తగ్గించి ప్రధాని మోదీ మధ్యతరగతి ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. ఇంత అద్భుతమైన బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు అభినందనలు.

- జీఎం శేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఏపీకి పెద్దపీట



కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట వేశారు. దేశ చరిత్రలో తొలిసారి కేంద్ర బడ్జెట్ రూ.50లక్షల కోట్లు మార్కును దాటడం విశేషం. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించారు. ఏపీకి జీవనాడి అయిన పోలవరం, విశాఖ స్టీల్‌కు నిధులు కేటాయించడం హర్షణీయం. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు ఈ బడ్జెట్ ఎంతో అనుకూలంగా ఉంది.

- అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

చాలా నిరాశపరిచింది



కేంద్ర బడ్జెట్ నిరుద్యోగ యువతకు, రైతాంగానికి, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చాలా నిరాశ కలిగించింది. ఏపీలోని 25 మంది ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. రాష్ట్రానికి చట్టపరంగా, హక్కుగా సక్రమించాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలకు నిధుల కేటాయింపు ప్రస్తావన లేకపోవడం దారుణం. బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మరోసారి తీరని ద్రోహం చేశారు. ఐఐటీ, ఐఐఎంలలో చదివినవారికీ ఉద్యోగాలు దొరకని దుస్థితి దేశంలో మొదటి సారి తలెత్తింది. బడ్జెట్ చూశాక రైతాంగం నిలువునా మునిగిపోయే పరిస్థితి కనిపిస్తోంది. పంటలకు కనీస మద్దతు ధర పెంచాలని, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని అడిగితే.. దాని ఊసే లేదు. రైతులు అప్పుల ఊబిలో మునిగిపోయారని, రుణమాఫీ చేస్తారని వారు ఆశించారని, దాని ప్రస్తావనే లేకపోవడం బాధాకరం.

- రఘువీరారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు, మడకశిర

హోటల్‌లో సంతకాలు



కదిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు ఓ టీ స్టాల్‌లో డాక్యుమెంట్లపై సంతకాలు చేశారు. రెండు రోజులుగా సెలవులో ఉన్న ఆయన.. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఓ టీస్టాల్‌లో శుక్రవారం దర్జాగా కూర్చోని సంతకాలు పెట్టారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వివరణ కోసం ప్రయత్నించగా.. ఆయన ఫోన్ పనిచేయలేదు.

- ఆంధ్రజ్యోతి, కదిరి

నకిలీ పట్టాలు.. ఫోర్జరీ సంతకాలు

వైసీపీ నాయకులతో కలిసి దందా

పోలీసుల అదుపులో సర్వేయర్, వీఆర్వో, మధ్యవర్తి



వీఆర్ఓ లాప్‌టాప్‌ను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

హిందూపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల మాటలు విని అక్రమాలకు పాల్పడిన అధికారులు, సిబ్బంది చిక్కుల్లో పడుతున్నారు. ఒకరి భూమిని మరొకరికి బదిలీ చేయడం,ఇంటి స్థలాలకు నకిలీ పత్రాలను సృష్టించడం ద్వారా రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ గోపాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక మండల సర్వేయర్, వీఆర్వో, మధ్యవర్తిని శనివారం అదుపులోకి తీసుకున్నారు.

ఫోర్జరీ సంతకాలతో..

2021 నుంచి 2024 మధ్య హిందూపురం తహసీల్దారు కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో వందలాది ఎంజాయ్‌మెంట్ పత్రాలను ఇచ్చారు. కొన్ని పంచాయతీల్లో భూముల ధరలు అమాంతం పెరగడాన్ని ఆదాయవనరుగా మార్చుకున్నారు. అప్పటి మండల సర్వేయర్, వీఆర్వో కలిసి వందలాది నకిలీ ఇంటి పట్టాలు తయారు చేశారు. పట్టాకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు వసూలు చేశారు. అప్పటి ముఖ్య అధికారి, మరో అధికారి సంతకాలను ఫోర్జరీ చేశారు. కిరికెర, కొట్నూరు, కొల్లకుంట, పూలకుంట, మణేసముద్రం, తూమకుంట పంచాయతీలలో ఇలాంటి అక్రమాలు భారీగా జరిగాయి.

నకిలీ పట్టాలు

విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ గోపాలకృష్ణకు మణేసముద్రం వద్ద పట్టా భూమి ఉంది. అందులో 17 మందికి రెండు సెంట్లు చొప్పున ఎంజాయ్‌మెంట్ పత్రాలను సృష్టించి ఇచ్చారు. అప్పటి తహసీల్దారు సంతకాన్ని, మరికొన్ని పత్రాల్లో గతంలో పనిచేసి వెళ్లిన తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేశారు. ఈ వ్యవహారంలో రూ.50 లక్షల వరకూ చేతులు మారినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై గత ఏడాది జూన్ 23న బాధితుడు గోపాలకృష్ణ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ కేసుతోపాటు తాజాగా నకిలీ ఇంటి పట్టాల కేసు నమోదైనట్లు సమాచారం. దీనిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గోరంట్ల మండల పరిధిలో ఉన్న ఓ వీఆర్వోను, కదిరి ప్రాంతంలో మండల సర్వేయర్‌ని శనివారం అదుపులోకి తీసుకున్నారు. వీరికి మధ్యవర్తిగా వ్యవహరించిన ఓ వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీఆర్వో నిర్మించుకున్న ఖరీదైన భవంతిలో సీఐలు రాజగోపాలనాయుడు, అంజినేయులు, ఎస్ఐలు మునిప్రతాప్, శ్రీధర్ తనిఖీలు చేశారు. ల్యాప్‌టాప్, కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. భవనం లోపల హంగులు చూసి విస్తుపోయినట్లు సమాచారం. అక్రమాలలో వైసీపీ నాయకుల పాత్ర గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

కాపురానికి రాలేదని భార్యను నరికిన భర్త

అడ్డొచ్చిన అత్తపైనా దాడి





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అత్త రాధమ్మ, భార్య లలితమ్మ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాకపోవడంతో మద్యం సేవించి వెళ్లి గొడవపడ్డాడు. కొడవలితో దాడి చేశాడు. అడ్డొచ్చిన అత్తనూ నరికాడు. ధర్మవరం మండలం బడన్నపల్లిలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. నారాయణ స్వామి, రాధమ్మ దంపతుల కూతురు లలితమ్మను కడప జిల్లా పులివెందుల తాలుకా వేముల మండలం భూమయ్యగారిపల్లికి చెందిన బ్రహ్మయ్యచారికి ఇచ్చి 16 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. విభేదాల కారణంగా ఏడాది క్రితం లలితమ్మ పుట్టింటికి వచ్చింది. సంక్రాంతి పండుగ సమయంలో బడన్నపల్లికి వచ్చిన బ్రహ్మయ్యచారి.. ఇకపై బాగా చూసుకుంటానని నమ్మించాడు. కుమారుడిని పండగకు తీసుకుపోయి, తిరిగి పంపలేదు. దీంతో గత నెల 28న వేముల పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ చేశారు. మూడు నెలల తర్వాత లలిత కాపురానికి వస్తుందని, కుమారుడిని ఆమెతో పాటు పంపించాలని పోలీసులు చెప్పి పంపారు. ఈ క్రమంలో బ్రహ్మయ్యచారి మద్యం సేవించి బడన్నపల్లికి శనివారం వచ్చాడు. కాపురానికి ఎందుకు రావడం లేదని భార్యతో గొడవపడ్డాడు. వెంట తెచ్చుకున్న కొడవలితో భార్య లలితమ్మ, అత్త రాధామ్మపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ గ్రామస్థులు ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లలితమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. బ్రహ్మయ్యచారి తన కుమారుడు నవదీప్‌ను బైకుపై ఎక్కించుకుని బత్తలపల్లి వైపు వెళ్లాడని గ్రామస్థులు తెలిపారు.

రైల్వేకు నిరాశే

గత ఏడాది కంటే తగ్గిన కేటాయింపులు

బడ్జెట్‌పై ఉద్యోగ సంఘాల పెదవి విరుపు



8

తొలిరోజు వెలవెల

నామమాత్రంగా రిజిస్ట్రేషన్లు



సిబ్బంది తప్ప ఎవరూ లేని చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పుట్టపర్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరుగుదల శనివారం నుంచి అమలులోకి వచ్చింది. దీంతో శుక్రవారం కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు.. శనివారం వెలవెలబోయాయి. జిల్లాలోని మొత్తం తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా వద్ద సందడి కల్పించలేదు. హిందూపురం, మడకశిర, బుక్కపట్నం, చిలమత్తూరు, కదిరిలో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. తనకల్లులో 4, పెనుకొండలో 3, ధర్మవరంలో 7, సీకేపల్లిలో ఒక రిజిస్ట్రేషన్ జరిగాయి. రిజిస్ట్రేషన్ ధరలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఎక్కడెక్కడ ఎంత పెరిగాయని పలువురు ఆరా తీశారు. పెంచిన ధరల నమోదులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు నిమగ్నమయ్యారు.

పింఛన్లు మొదలు పెట్టిందే ఎన్టీఆర్

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



వెంకటాపురం తండాలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులను ఆదుకునేందుకు పింఛన్లను మొదలు పెట్టిందే ఎన్టీఆర్ అని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. వెయ్యి రూపాయలు ఉన్న పింఛన్లను మూడు రెట్లు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని అన్నారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటాపురం తండాలో శనివారం ఆమె పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. గ్రామస్థులు ఆమెపై పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. పింఛన్లు సకాలంలో అందుతున్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 2.64 లక్షల మందికి రూ.119 కోట్లు, పెనుకొండ నియోజకవర్గంలో 41 వేల మందికి రూ.17.62 కోట్లు పింఛన్లు ఈ నెలలో ఇస్తున్నామని తెలిపారు. వెంకటాపురం తండాలో 42 మందికి రూ.1.78 లక్షలు అందిస్తున్నామని తెలిపారు.

వారంలోగా సొమ్ము జమ

రొద్దం మండలం చోళేమర్రిలో మంత్రి సవిత పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాలో అత్యధికంగా కందులు సాగుచేస్తున్నారని, కంది దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. క్వింటానికి రూ.7,550 మద్దతు ధర ఇస్తున్నామని, కొనుగోలు చేసిన వారంలోపు రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని తెలిపారు. ఒక్కో మండలానికి రూ.15 లక్షల విలువచేసే డ్రోన్ పరికరాలను ఇస్తామని తెలిపారు. రొద్దంలో మండలంలో 20 గోకులం షెడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. పల్లె పండగ పేరుతో రూ.6 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం పింఛన్లను పంపిణీ చేశారు.

ఏడాది క్రితమే పెండింగ్ రిజిస్ట్రేషన్

అప్పుడూ సంబంధం లేని వ్యక్తులతోనే

వైసీపీ నాయకుడికి కూటమి నేత సహకారం



చిలమత్తూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాగలేరు రెవెన్యూ పొలం సర్వే నంబర్లు 2-2, 3-1, 3-2, 4-2లోని 24 ఎకరాలను కాజేసేందుకు వైసీపీ నాయకుడు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాడు. వైసీపీ హయాంలో 2023, మార్చి 18న పెండింగ్ డాకుమెంట్‌గా ఈ భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అప్పుడు కూడా ఆ ఆస్తితో సంబంధం లేని వ్యక్తులతో చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పీడీ రిజిస్ట్రేషన్ జరిపించాడు. ఆ వ్యక్తులను కాదని, ఇప్పుడు కొత్త వ్యక్తుల పేరిట 1-బిలను చేయించాడు. ఆ భూముల విలువ నానాటికీ పెరుగుతుండంతో కాజేసేందుకు ఇలా అడ్డగోలుగా ప్రయత్నాలు చేశాడు. వైసీపీ హయాం నుంచి అధికారులపై ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. కానీ నాటి తహసీల్దార్లు, కింది స్థాయి అధికారులు బెదరలేదు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్విఘ్నంగా చేసుకుంటున్నాడు. పెద్ద మొత్తంలో ఆశ చూపి, పలుకుబడి ఉపయోగించి తతంగాన్ని నడిపించినట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు వెనుకాముందు ఆలోచించకుండా 1-బిలు చేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కూటమి పార్టీలోని ఓ నాయకుడు ఈ అక్రమాలకు సహకరించినట్లు ఆ పార్టీలోనే చర్చసాగుతోంది. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై విస్తృత చర్చ జరుగుతోంది.

డ్వామాలో రగడ



8

యువరైతు ఆత్మహత్య

టీసీసీ- 2024 సర్టిఫికెట్లు తీసుకెళ్లండి



నూతన డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో ఎస్పీ వీ.రత్న శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్కను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి రూరల్

రైల్వేకు నిరాశే

గత ఏడాది కంటే తగ్గిన కేటాయింపులు.. బడ్జెట్‌పై ఉద్యోగ సంఘాల పెదవి విరుపు



గుంతకల్లు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు నిరాశే మిగిలింది. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో గత ఏడాది కంటే తక్కువ బడ్జెట్‌ను రైల్వేకు కేటాయించారు. దీంతో రైల్వేల అభివృద్ధి మందకొడిగా ఉంటుందని భావిస్తున్నారు. ఉద్యోగుల ఆదాయపు పన్ను పరిధి స్లాబ్‌లను పెంచినా 8వ పే కమిషన్ వచ్చిన తర్వాత ఈ మినహాయింపులు ఎందుకూ కొరగాకుండాపోతాయని రైల్వే ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు. 2017లో పార్లమెంటులో రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేసిన తర్వాత ప్రతి ఏడూ రైల్వేకు కేటాయింపుల సమాచారాన్ని కుదిస్తూ వచ్చి ఈ సంవత్సరం ఏమాత్రం వివరణల్లేకుండా మమ అనిపించారు. ఈ కారణంగా రైల్వే అధికారులు సైతం ఏ అంశానికి ఎంత కేటాయింపు జరిగిందనే విషయంగా ఏమీ చెప్పలేకపోతున్నారు. రైల్వే కేటాయింపులపై త్వరలో విడులయ్యే పింక్ బుక్‌లోనే ఏదైనా సమాచారం లభించే అవకాశం ఉంది.

ట్రాక్ రెన్యువల్‌కు పెద్దపీట

రైల్వేకు గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు రూ. ఏడు వేల కోట్ల తక్కువ బడ్జెట్‌ను కేటాయించారు. ఈ సంవత్సరం రైల్వే కేటాయింపుల్లో రైల్వేలో భద్రతా ప్రమాణాలు, రైళ్ల వేగాల పెంపు విషయంగా దృష్టిని నిలిపారు. ట్రాక్ రీప్లేస్మెంట్‌కు అత్యధిక ప్రాధాన్యమినిచ్చారు. కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం తక్కువ స్థాయిలో చేపట్టనున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ట్రాక్ రెన్యువల్ ఆవశ్యకత ఎక్కువగా ఉంది. దేశంలో 5,500 కి.మీ.ల ట్రాక్‌ను రీప్లేస్ చేయనుండగా, కేవలం 700 కి.మీ.ల కొత్త ట్రాక్‌ను నిర్మించే లక్ష్యం పెట్టుకున్నారు.

ఐటీ మినహాయింపుపై పెదవి విరుపు

కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను స్లాబ్‌లను పెంచి రూ. 12 లక్షలదాకా ఆదాయమున్నవారికి వివిధ స్థాయిల్లో ఉపశమనం కల్పించినా రైల్వే ఉద్యోగ సంఘాలు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నాయి. ఈ స్లాబ్‌లను అనుసరించి గత సంవత్సరం ట్యాక్స్ పరిధిలో ఉన్న ఉద్యోగులకు రూ. 25 వేల నుంచి రూ. 1 లక్షదాకా పన్ను మినహాయింపు లభిస్తుందని, కానీ అది వచ్చే ఆర్థిక సంవత్సరానికి మాత్రమే ప్రయోజనం కలుగుతుందే తప్ప తర్వాత ఎటువంటి ఉపయోగం ఉండదని తెలియజేశారు. 8వ వేతన సవరణ సంఘాన్ని నియమించగా, దాని సిఫారసుల మేరకు వచ్చే సంవత్సరం జీతాల పెంపు, అరియర్స్ లభిస్తాయని, జీతాలు పెరిగిన తర్వాత యథాతథంగా పన్ను మొత్తాలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ. 12 లక్షల దాకా స్లాబ్‌ల ప్రసక్తి లేకుండా ఆదాయాన్ని పన్ను మినహాయింపు ఇవ్వాల్సి ఉందని డిమాండ్ చేస్తున్నారు.

నిర్లక్ష్యం చేశారు: ప్రభాకర్, ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి



బడ్జెట్‌లో రైల్వే శాఖకు ప్రాధాన్యం తగ్గిస్తూ వస్తున్నారు. ఈ బడ్జెట్‌లో ఏమీ ప్రకటించలేదు. రైల్వేలో ఉద్యోగితను పెంచే ఊసే లేదు. ఉద్యోగులకు ప్రకటించిన ఐటీ వెసులుబాటు పెద్దగా ఉపయోగం లేదు. వచ్చే సంవత్సరంలో 8వ వేతన సంఘ సిఫారసులు అమలై జీతాలు పెరుగుతాయి. అది తెలిసే ఐటీ స్లాబ్‌లను నామ్కేవాస్తేగా పెంచారు. జీతాలు పెరిగిన వెంటనే అన్ని వస్తువుల ధరలూ పెరిగిపోతాయి. వాటికి విధించే వ్యాట్, రాష్ట్ర పన్నుల వల్ల ఐటీ మినహాయింపు ఇచ్చినదానికంటే ఎక్కువ లాగేసుకుంటారు.

కంటితుడుపే: మస్తాన్‌వలి, మజ్దూర్ యూనియన్ రిటైర్డు ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి



బడ్జెట్‌లో ఇచ్చిన ఆదాయపు పన్ను మినహాయింపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. ఇది రైల్వే ఉద్యోగులకు పెద్దగా మేలు చేయదు. పైగా దేశానికి వెన్నెముకగా ఉన్న రైల్వేను బడ్జెట్‌లో పక్కనపెట్టేస్తున్నారు. రైల్వేల అభివృద్ధిపై ప్రజలకు పారదర్శకంగా వివరించాల్సిన అవసరముంది. కొత్త రైళ్ల గురించి ప్రకటనలే లేకుండా పోయాయి.

కాస్త ఉపశమనం..!

(7వ పేజీ తరువాయి)

చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరినట్లయింది. అదే విధంగా టర్మ్‌లోన్ స్కీమ్‌తో ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణాలందజేసి ఆ వర్గాల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చారు. ఈ పథకం ద్వారా రూ.2 కోట్ల వరకూ రుణాలు అందించనున్నారు. దేశంలో 120 కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే వినియోగంలో ఉన్న సత్యసాయి ఎయిర్ పోర్టు ద్వారా పౌరవిమానయాన సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వేలాది మందికి ఊరట

మధ్య తరగతి, వేతన జీవులకు బడ్జెట్‌లో ఆదాయపు పన్నుకు సంబంధిచి కాస్త ఉపశమనం కలిగింది. రూ.12 లక్షల ఆదాయం వరకూ ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా రిబేట్ ప్రకటించారు. దీంతో పాటు కొత్త ఆదాయపు పన్ను విధానంలో స్లాబులను మార్చారు. దీనికి మరో రూ. 75 వేలు స్టాండర్డ్ డిడక్షన్ కలిపితే మొత్తం మీద రూ. 12.75 లక్షల వరకూ పన్ను మినహాయించినట్లయింది. ఆదాయపు పన్ను మినహాయింపుల ద్వారా ఒక్క అనంతపురం జిల్లాలోనే మూడు లక్షల మంది చిరు, మధ్య తరహా వ్యాపారులతో పాటు 50 వేల మందికిపైగా ఉద్యోగులకు ఊరట లభించినట్లయింది. కొత్త పన్ను విధానంలో మార్చిన స్లాబులను పరిశీలిస్తే... రూ. 4 లక్షల వరకూ 0, రూ. 4 నుంచి రూ. 8 లక్షల వరకూ 5 శాతం, రూ. 8 లక్షల నుంచి రూ. 12 లక్షల వరకూ 10 శాతం, రూ. 12 నుంచి రూ. 16 లక్షలకు 15 శాతం, రూ. 16 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకూ 20 శాతం, రూ. 20 లక్షల నుంచి రూ. 24 లక్షల వరకూ 25 శాతం, రూ. 24 లక్షలకుపైన రూ. 30 శాతం పన్ను విధించారు. తద్వారా ఆయా వర్గాలకు రూ. 30 వేల నుంచి రూ. 1.1 లక్షల వరకూ లబ్ధి చేకూరనుంది.



కిసాన్ క్రెడిట్ రుణ పరిమితి పెంపు

కిసాన్ క్రెడిట్ రుణ పరిమితి ఇదివరకూ రూ. 3 లక్షలు ఉండేది. బడ్జెట్‌లో రుణ పరిమితిని రూ. 5 లక్షల వరకూ పెంచారు. అనంతపురం జిల్లాలో ఆరు లక్షల మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 2.52 లక్షల రైతులున్నారు. దీంతో ఇప్పటి వరకూ అనంతపురం జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డు పొందిన దాదాపు 2 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కిసాన్ క్రెడిట్ ద్వారా ఇచ్చే రుణాలకు వడ్డీ నాలుగు శాతం లేదా అంత కన్నా తక్కువగా ఉంటుంది. ఈ కార్డు పొందేవారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమాయోజన వర్తిస్తుంది.

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం..

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కేంద్రం వరాలజల్లులు కురిపించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ)కు ఇదివరకూ రూ. 5 కోట్ల వరకూ రుణాలిచ్చేవారు. తాజా బడ్జెట్‌లో ఆ రుణాలను ఏకంగా రూ. 10 కోట్లకు పెంచారు. అదే విధంగా స్టార్టప్‌లకు రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లకు రుణాలు పెంచారు. ఈ విషయానికొస్తే... అనంత జిల్లాలో 43 వేలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 8600 ఎంఎస్ఎంఈలకు లబ్ధి చేకూరనుంది.

సామాన్యులకు సాంత్వన



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు సాంత్వన కలిగించింది. పోలవరం ప్రాజెక్టుకు రూ. 400 కోట్లు, విశాఖ పోర్టుకు రూ. 445 కోట్లు కేటాయించడం శుభపరిణామం. పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ బడ్జెట్ ఊరట కలిగించింది. ఏపీకి ఈ స్థాయిలో నిధులు రావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి ఉంది. పలుమార్లు ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర పరిస్థితులు వివరించి భారీ స్థాయిలో నిధులు రాబట్టారు.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బడ్జెట్



రాష్ట్రంలో ఇంటికొక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, వ్యాపారవేత్తను తయారుచేయాలన్నది సీఎం ఆకాంక్ష. వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాన్ని కల్పించేందుకు మండలానికొక టెక్‌టవర్‌ను ఏర్పాటుచేసి నిరుద్యోగాన్ని రూపుమాపాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ అంశాలకు ఊతమిచ్చి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిడానికి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దోహదపడుతుంది. విద్య, వ్యవసాయం, పరిశ్రమల రంగాలతోపాటు అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్ తదిరాలకు బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించారు.

- ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్టీయూ ఇన్‌చార్జ్ వీసీ

ప్రజావ్యతిరేక బడ్జెట్



వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు ఊసే లేకపోగా... రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయించలేదు. బిహార్‌కు రూ. వేల కోట్ల నిధులు కేటాయిస్తుంటే బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రం గురించిగానీ, రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపులు గురించి ఊసేలేకపోవడం బాధా కరం. వివక్షకు ఇదే నిదర్శనం. వ్యవసాయరంగాన్ని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు బడ్జెట్‌లో అనేక ప్రతిపాదనలు చేశారు. సుదీర్ఘ కాలం పాటు రైతులు పోరాడుతున్న వ్యవసాయ కుట్ర చట్టాలు, రైతు ఆత్మహత్యలపై ఒక్క మాట మాట్లాడలేదు. ఇదొక ప్రజావ్యతిరేక బడ్జెట్.

- రాంభూపాల్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

రాష్ట్రానికి మొండి చేయి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో మొండి చేయి చూపారు. రాష్ట్రంలోని కొత్త ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోడం కూటమి వైఫల్యానికి నిదర్శనం. కేంద్ర బడ్జెట్ సంతృప్తికరంగా లేదు. మధ్య తరగతి ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపులు తప్పా, కొత్తదనం ఏమీ లేదు. ప్రభుత్వ రంగసంస్థలను, ప్రైవేట్ వైపు మళ్లించడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారాలు తెరిచింది. విదేశీ పెట్టుబడులకు రెడ్ కార్పెట్ పరిచి, దేశీయసంస్థలను నిర్వీర్యం చేసేలా బడ్జెట్ ఉంది.

- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఉరవకొండ

ప్రభుత్వ విద్యకు గ్యారెంటీ లేదు



బీజేపీ ఎన్నికల ప్రణాళికలో విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తామని చేసిన వాగ్దానానికి అనుగుణంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు లేదు. రూ. 50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ. 1.28 లక్షల కోట్లు కేటాయించడమంటే హామీని నీరుగార్చడమే. మొత్తం బడ్జెట్‌లో 2.53 శాతం ప్రభుత్వ విద్యకు బడ్జెట్ కేటాయించి మమ అనిపించారు. దీన్నిబట్టి చూస్తే... ప్రభుత్వ విద్యకు గ్యారెంటీ లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది. గత బడ్జెట్‌లో కంటే 0.03 శాతం నిధులు తగ్గించారు.

- కోనంకి అశోక్‌కుమార్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏడుపుగొట్టు బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినది ఏడుపుగొట్టు బడ్జెట్. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో వృద్ధి రేటు పెరగలేదు. ఎగుమతులు లేవు. విదేశీ పెట్టుబడులు రావడం లేదు. ప్రభుత్వరంగం కునారిల్లుతోంది. బిహార్, ఢిల్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా పన్ను మినహాయింపు ఇచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. వెనుకబడిన జిల్లాలకు కేటాయించిన నిధుల ఊసే లేదు. విభజన హామీల అమలును గాలికొదిలేశారు.

- జగదీష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

పరిశోధన, ఆవిష్కరణలకు దోహదం



వర్సిటీలకు బలమైన పునాదుల్లాంటి పరిశోధన, అవిష్కరణలను బలోపేతం చేసేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దోహదపడుతుంది. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల సౌకర్యాల కల్పనకు, విద్యాసంస్థల బ్రాడ్‌బ్యాండ్‌ను మెరుగు పరిచేందుకు. యువత అభివృద్ధిని పెంపొందించేలా పెట్టుబడులకు పెద్దపీట వేశారు. తక్కువ జీతాలు పొందే ఉద్యోగులకు ట్యాక్స్ అంశంలో ఉపశమనం కల్పించారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ప్రశంసనీయం..

-ప్రొఫెసర్ అనిత, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ

రూ.5500 కోట్ల నిధులు



దేశవ్యాప్తంగా 37 సెంట్రల్ యూనివర్సిటీలకు రూ.5500 కోట్ల నిధులను కేటాయించారు. వీటిని వర్సిటీల అవసరాలకు విడతల వారిగా చెల్లించనున్నారు. మనకు రెండో విడతలో రూ.498 కోట్లు రావాలి. కేపిటల్, శాలరీస్, రికరింగ్ విభాగాల వారిగా నిధులను సద్వినియోగం చేసుకోవాలి. మౌలిక వసతులను మెరుగు పరుచుకుని వికసిత్ భారత్‌లో సెంట్రల్ యూనివర్సిటీలను భాగస్వామ్యం చేయాలన్న ముందుచూపుతో నిధులు కేటాయించడం హర్షణీయం.

- ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ

మధ్యతరగతి అభ్యున్నతికి ఊతం



కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి ఊతమిచ్చేలా ఉంది. సామాన్యుల సంక్షేమానికి అత్యుత్తమ బడ్జెట్. ప్రజలపై పన్నుల భారం తగ్గించడం అభినందనీయం. ఇప్పుడు నెలకు లక్షరూపాయలు సంపాదించేవారికి కూడా పన్నులేదు. ఏపీలో వెనుకబడిన జిల్లాలకు 155కోట్లు రూపాయలు ప్రకటించడం అభినందనీయం. కిసాన్‌కార్డుద్వారా రైతాంగానికి రూ.మూడులక్షల నుంచి రూ.5లక్షల వరకు రుణపరిమితి పెంచడం హర్షణీయం.

- పల్లె సింధూరా రెడ్డి, ఎమ్మెల్యే పుట్టపర్తి

రాష్ట్రానికి అగ్రతాంబూలం



ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అగ్రతాంబూలం లభించింది. పోలవరం ప్రాజెక్ట నిర్మాణానికి నిధులు, అమరావతి నిర్మాణంతోపాటు, విమానాశ్రయ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో ఉడాన్ పథకం కింద చిన్న చిన్న విమానాశ్రయాలకు, హెలీప్యాడ్ నిర్మించే పథకాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించడం రాష్ట్రాభివృద్ధికి శుభపరిణామం. పేదల సంక్షేమానికి బడ్జెట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. డబుల్ ఇంజన్ సర్కార్‌వల్ల రాష్ట్రానికి మేలే జరుగుతోంది.

- ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర

మిడిల్ క్లాస్ ఫ్యామిలీ బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి చాలా అనుకూలంగా ఉంది. 40 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా బడ్జెట్‌ను తయారు చేశారు. రూ. 12లక్షల లోపు ఆదాయం ఉన్న వాళ్లకు పన్ను మినహాయింపు ఇవ్వడం చాలా బాగుంది. వెనుకబడిన జిల్లా ప్రజలకు చాలా అనుకూలంగా ఉంటుంది. మైక్రో రుణాలద్వారా ఉపాధి పొంది కోట్లాది మంది జీవనోపాధి పొందుతారు. రైతులకు ఐదు లక్షల అందించి వారు బాగోగుల గురించి ఆలోచించి ఉంటే బాగుండేది.

- రాంప్రసాద్, చాంబర్‌ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు, హిందూపురం

సామాన్యుల బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు అనుకూలంగా ఉంది. రాష్ట్రానికి న్యాయం జరిగింది. పోలవరం, విశాఖ స్టీల్‌ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. యువత ,మహిళలు, నిరోద్యోగులు, రైతులను దృష్టి పెట్టుకుని అనేక కేటాయింపులు చేశారు. వేతన జీవులకు ఊరట కలిగించారు. ప్రపంచంలో భారత దేశం సూపర్ పవర్ కావడానికి ఈబడ్జెట్ ఎంతో ఉపయోగపడుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎంఎస్ఎంఎను ప్రోత్సహించింది. ఇది సామాన్యుల అనుకూల బడ్జెట్.

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

డ్వామాలో రగడ

ఏపీడీ, టీఓ వాగ్వాదం



వాగ్వాదానికి దిగిన వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రమేష్‌బాబు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): డ్వామా కార్యాలయంలోని వాటర్ షెడ్ విభాగంలో గొడవ జరిగింది. వాటర్‌షెడ్ అడిషినల్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రమేష్‌బాబు పరస్పరం దూషించుకుని, భౌతిక దాడికి ప్రయత్నించారు. సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఇదంతా డ్వామాలో పీడీ సలీం బాషా ఎదుటే శనివారం జరిగింది. కూడేరు మండలం ఇప్పేరు వాటర్‌షెడ్ ప్రాజెక్టులో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబు, అడిషినల్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి మధ్య కొంతకాలంగా పలు అంశాల్లో విభేదాలు కొనసాగుతున్నాయి. తనకు విద్యార్హత, సీనియార్టీ ఉన్నందున ఉద్యోగోన్నతి కల్పించాలని టీఓ రమేష్‌బాబు అడుగుతున్నారు. కొంత కాలం ఆగాలని ఏపీడీ చెబుతూ వచ్చారు. వీరి మధ్య వాటర్‌షెడ్ పనులు, నిధుల వినియోగం, బిల్లులు చేయడంలో విభేదాలు తలెత్తినట్లు సమాచారం. తాను పనిచేస్తున్న ఇప్పేరు వాటర్‌షెడ్ ప్రాజెక్టుకు డ్వామా పీడీ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసులును నియమించడం ఏమిటని రమేష్‌బాబు ఏపీడీని నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఏపీడీ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని, కులం పేరిట దూషిస్తున్నారని రమేష్‌బాబు ఆరోపించారు. వాటర్‌షెడ్ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని, వ్యతిరేకించినందుకు కక్షపెట్టుకున్నారని ఆరోపించారు. తాను అక్రమాలకు పాల్పడలేదని, వాటర్‌షెడ్ పనులన్నీ పారదర్శకంగా జరిగాయని ఏపీడీ అన్నారు. పీడీ సలీంబాషా ఇద్దరికీ సర్దిచెప్పి పంపించారు.

పాడి రైతులకు మూడు రోజుల శిక్షణ

వెటర్నరీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): జాతీయ పశుగణన మిషన్‌లో భాగంగా రైతులకు పాడి పశువుల పెంపకంపై మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం మండలంలోని రెడ్డిపల్లి వద్ద జరుగుతుందన్నారు. పాడి పశువుల ఎంపిక, మెలకువలు, పశువుల ఉత్పత్తి పెంచటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషణ వ్యాధులు, లేగ దూడల పెంపకం తదితర అంశాలపై శిక్షణ తరగుతులు నిర్వహిస్తామన్నారు. క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రంలో పాల్గొనే రైతులు వెటర్నరీ ఏడీ వినోద్ 9701110362, గోల్డ్‌స్మన్ 8328205176, రామచంద్రరెడ్డి 8790997554లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని రైతులు ఎవరైనా పాల్గొనవచ్చుని సూచించారు.

వేతన జీవులకు మేలు



కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు మేలు జరిగింది. ఏటా రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను కట్టన వసరం లేకపోవడం ఎంతో ఊరటనిచ్చే అంశం. దీంతో మధ్యతరగతి ప్రజలు లబ్ధి పొందనున్నారు. యువత నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం. మధ్యతరగతి ప్రజల కోసం 40వేల ఇళ్లు కేటాయించడం ఎంతో మంచిది.

- చిలకం మధుసూదన్‌రెడ్డి, జనసేన

అభినందనీయం



కేంద్ర బడ్జెట్ అభినందనీయం. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధికంగా నిధులు కేటాయించడం శుభ సూచకం. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తేవడంలో పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలో సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు ఉండటం వల్లే నిధులు తేగలిగారు. నిధులు కేటాయించినందుకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు.

- గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సర్వర్ సతాయింపు



సర్వర్ పని చేయకపోవడంతో ఆజాద్ నగర్ స్టోర్ వద్ద కూర్చున్న కార్డుదారులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సర్వర్ మొరాయించడంతో చౌకధాన్య డిపోల వద్ద రేషన్‌కార్డుదారులు వనివారం బారులు తీరారు. డీలర్లు మధ్యాహ్నం వరకూ కొందరికి బియ్యం పంపిణీ చేసి.. ఆ తరువాత మూసేశారు. తిరిగి సాయంత్రం 4 గంటల తరువాత ప్రయత్నించినా.. సర్వర్ సహకరించలేదు. ఆలస్యం అయితే సరుకుల్లో కోత పడుతుందని భావించి, మొదటి రోజే కార్డుదారులు క్యూ కట్టారు. అధికారులు స్పందించి, సర్వర్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

యువరైతు ఆత్మహత్య



నాగప్రసాద్ (ఫైల్)

నార్పల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన యువరైతు నాగప్రసాద్(32) అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగప్రసాద్ ఆరు ఎకరాల పొలంలో ఐదేళ్లుగా టమోటా, మిరప, కలింగర తదితర పంటలు సాగు చేసి నష్టపోయాడు. సేద్యానికి తెచ్చిన అప్పులు రూ.11 లక్షలు పేరుకుపోయాయి. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో నార్పల శివారులో శుక్రవారం పురుగుల మందు తాగి, అపస్మారకస్థితిలో పడిపోయాడు. స్థానికులు గమనించి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. నాగప్రసాద్‌కు భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

టీసీసీ- 2024 సర్టిఫికెట్లు


తీసుకెళ్లండి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఏప్రిల్‌లో టీసీసీ రాసిన అభ్యర్థుల సర్టిఫికెట్లు డీఈఓ ఆఫీస్ అందుబాటులో ఉన్నాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ శనివారం తెలిపారు. టీసీసీ- 2024లో డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ పరీక్షలు రాసిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు తీసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఏప్రిల్ ఎగ్జామ్ హాల్‌టికెట్లతోపాటు, ఆధార్ కార్డును తీసుకుని కమలా నగర్‌లోని డీఈఓ ఆఫీస్ పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

● పదో తరగతి విద్యార్థులకు నేటి నుంచి అమలు ● ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ధర్మవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి ఎంతో కీలకం. అందులో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. ఇందుకు అదనపు తరగతుల నిర్వహణతో పాటు, రెండో శనివారం, ఆదివారం సైతం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాల పనివేళల్లో మాత్రమే భోజనం అందిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ భోజనం సమకూర్చాలని నిర్ణయించింది. ఈనెల 2 నుంచి మార్చి 10వతేదీ వరకు ఈ సదుపాయం కల్పించనుండడంతో ఇంటి నుంచి క్యారేజీ తెచ్చుకునే ఇబ్బందులు ఉండవని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మరింత ఉత్సాహంగా చదువుకుని సత్ఫలితాలు సాధిస్తామంటున్నారు. సత్యసాయి జిల్లాలో 32 మండలాల్లో 316 జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పదో తరగతి విద్యార్థులు 85,789 మంది చదువుతున్నారు. మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉత్తీర్ణత శాతం పెంచాలనే లక్ష్యంతో పాఠశాలల్లో గత ఏడాది డిసెంబరు 1 నుంచి 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి తీసుకుని చదివిస్తున్నారు. పాఠశాల పనివేళల్లో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికితోడు రెండో శనివారం, ఆదివారం కూడా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కావడం, దూర ప్రాంతాల నుంచి రావాల్సి ఉండడంతో తరగతులకు క్యారేజీలు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా కొంత మంది ప్రత్యేక తరగతులకు రావడం లేదు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లడంతో సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్ణయించింది. దీంతో తరగతులకు హాజరయ్యే



ధర్మవరంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనిపై ఉత్తర్వులు అందాయని నేటి నుంచి అమలు చేస్తామని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. సెలవు రోజుల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం మెనూ ఇలా ఉంటుంది. రెండో శనివారం.. అన్నం, సాంబారు, కాయగూరలతో కర్రీ, వక్రపొంగలి, ఆదివారం.. పలావు, కోడిగుడ్డు, చిక్కీ వడ్డిస్తారు.

ఉత్తీర్ణత పెంపే లక్ష్యం: కిష్టప్ప, డీఈఓ



పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలో భాగంగా సంక్షేమ కార్యక్రమం నిర్వహిస్తోంది. సెలవుల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వారికి భోజన వసతులు లేకపోవడం తో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈవిషయాన్ని గుమనించిన ప్రభుత్వం సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజనానికి అనుమతి ఇచ్చింది.

న్యూస్ బాక్స్

అశోక్‌కు యువభారత్ గౌరవ్ సన్మాన్ అవార్డు



అశోక్‌కు అవార్డు అందజేస్తున్న భారత్ వికాస్‌సంఘం సభ్యులు

కొత్తచెరువు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు గ్రామానికి చెందిన అశోక్ దావపాటికి భారత్ వికాస్ సంఘం యువ భారత్ గౌరవ్ సన్మాన్ అవార్డును ప్రదానం చేసింది. ఆయన గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నారు. వదన్య సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తూ విజేతలకు బహుమతులను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన కేవీఎస్ గోవిందాచార్యులు స్థాపించిన భారత్ వికాస్ సంఘం యువ భారత్ గౌరవ సన్మాన్ అవార్డును అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన సమన్వయకర్త బసవరాజ్ పాటిల్, మాజీ ఎంపీ, రిటైర్డ్ మేజర్ జనరల్ ప్రమోద్‌సెహగల్, వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకు డు మాధవరెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి లీలాలక్ష్మారెడ్డి పాల్గొన్నారు. దేశంలో 51 మందిని గుర్తించి ఈ అవార్డులను అందించారని అశోక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీఐ మిట్ట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లికి చెందిన వెంకటేష్ అనే వృద్ధుడు మామిళ్లకుంటపల్లిలో పింఛన్ తీసుకుని, ఓడీసీ వైపు వస్తున్నారు. ఓడీసీ నుంచి కొండకమర్ల వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో వెంకటేష్‌తోపాటు, చరణ్ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం 108లో కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

తాడిమర్రి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికి రేషన్‌కార్డు ఇవ్వాలనిసీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కాటమయ్య కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణ, దాను, చిన్న పెద్దన్న పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు

నల్లమాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా బీసీలకు 34 సబ్సిడీ రుణాలు మంజూరైనట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. స్లాబ్ -1కు 24 యూనిట్లు, రూ.2లక్షల రుణం రూ.75వేలు సబ్సిడీ, స్లాబ్ -2లో 7 యూనిట్లు రూ.3 లక్షలు, రూ.లక్ష 25వేలు సబ్సిడీ, స్లాబ్ -3లో 3 యూనిట్లు రూ.3 నుంచి 5 లక్షల ఇందులో రూ.2 లక్షలు సబ్సిడీ ఉంటాయని వివరించారు. ఈనెల 7లోపు మీసేవ, గ్రామ సచివాలయాల్లో కానీ ఆన్‌లైన్‌లో, కులం, ఆదాయం, ఆధార్, పాస్‌పోర్టుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

●ధర్మవరంరూరల్: మండలంలోని బీసీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కొరకు ఆయా కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కోసం ఈనెల 7లోగా సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ సాయిమనోహర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

వ్యవసాయ అధికారిగా శంకర్‌నాయక్



నల్లమాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా బి. శంకర్‌నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇతడు కదిరి ఏడీఏకు పనిచేస్తూ బదిలీపై నల్లమాడ ఏఓగా వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ సుమతి నంద్యాల జిల్లా వ్యవసాయ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో శంకర్‌నాయక్ బాధ్యతలు చేపట్టారు.

అగ్ని ప్రమాదంలో రైతుకు రూ.1.5 లక్షల నష్టం



కాలిపోయిన అలసంద పంట

తనకల్లు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎద్దులపల్లి వద్ద శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు శివన్నకు రూ.1.50 లక్షల నష్టం సంభవించింది. రైతు తెలిపిన వివరాల మేరకు.. శివన్న కర్ణాటక నుంచి విత్తన అలసంద లు తెచ్చి మూడు ఎకరాల్లో సాగుచేశాడు. క్వింటాలు రూ.22వేలకు కంపెనీవారితో ఒప్పందం చేసుకున్నారు. పంటకూడా ఆశాజనకంగా ఉంది. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు గుట్టకు అగ్గి పెట్టడంతో మంటలు వ్యవసాయ పొలానికి వ్యాపించి మూడు ఎకరాల్లో చుట్టు ఒక సాలు మేర అలసంద పంట నష్టం జరిగింది. అలాగే 250 మీటర్ల డ్రిప్ పైపులు కాలిపోయాయి. ఫైర్ సర్వీస్ వైరుకూడా అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మంటలను అదుపు చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



తనకల్లు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కంటి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సూర్యనారాయణ(48) చింతచెట్టుకు ఉరివేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాల మేరకు.. కొక్కంటి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సూర్యనారాయణ కదిరి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇతడు సైదాపురంలో నివాసముంటున్నారు. భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇటీవల పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. మిగిలినవారికి చదువు చెప్పిస్తానో లేదో అన్న బెంగతో ఇబ్బందులు పడేవారు. శుక్రవారం సాయంత్రం కొక్కంటి లోఉన్న తల్లి కుర్మయమ్మను చూడడానికి వచ్చారు. తల్లిని పలకరించి, రూ.1500 నగదు ఇచ్చారు. రాత్రి 7గంటల సమయంలో ద్విచక్రవాహనంలో కొక్కంటి సమీపంలోఉన్న కుర్రేగంగమ్మ ఆలయం వద్దకు వెళ్లి ఆయలం పక్కనుంచి తిమ్మానాయినిచెరువుకు వెళ్లే దారిలో చింతచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. శనివారం ఉదయం వ్యవసాయ పనులకోసం వెళ్తున్న రైతులు, కూలీలు విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి భార్య గంగాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి : ఎస్పీ



హోంగార్డు నియామక పత్రం అందజేస్తున్న ఎస్పీ వి.రత్న

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో విధులు నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలని కారుణ్య నియామకం కింద హోంగార్డుగా నియామక పత్రం అందుకున్న ప్రసన్నకుమార్‌కు జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. బత్తలపల్లిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన అంజనేయులు కుమారుడికి శనివారం తన చాంబర్‌లో హోంగార్డుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సాధారణం

ప్రతిఉద్యోగికి పదవీ విరమణ సాధారణమని, సర్వీసులో ఉండగా ప్రజలకు అందించిన సేవలే శాశ్వతమని ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జనవరి 31న పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ వఙ్కట్లు, హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, ఏఆర్ ఎస్ఐలు రామలింగారెడ్డి, రంగయ్యకు నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిఉద్యోగికి పదవీ విరమణ సాధారణమని, ప్రజలకు అందించిన సేవలే శాశ్వతం అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఆర్ఐలు వలి, మహేష్, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



గ్రామోత్సవంలో శివపార్వతులు

బత్తలపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లి ఓంకారేశ్వర దేవాలయంలో శనివారం తెల్లవారుజామున ఓంకారేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి తిలకించారు. సాయంకాలం గ్రామోత్సవంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక హంస వాహనంలో ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా ఎస్ఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందో బస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ శ్యాప్‌రావు, బీజేపీ నాయకుడు కోటి సూర్యప్రకాష్‌బాబు, జడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, రామాంజి, యోగా, గోపాల్, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్లూమూన్ వార్షికోత్సవం



విద్యార్థిని నృత్యం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్లూమూన్ విద్యా సంస్థ 15 వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీఓ వీవీఎస్ శర్మ, ఆర్టీఓ శ్రీనివాసులు, సీఐ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ మదన్‌కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సుందరమోహన్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణ పండుగ వాతావరణం నెలకొంది. పలువురు వక్తలు మాట్లాడుతూ.. విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తున్న బ్లూమూన్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న పుట్టపర్తిలో మెగా జాబ్‌మేళా

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న పుట్టపర్తిలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 50పైగా కంపెనీలు రెండు వేల మందిని తీసుకుంటాయని వివరించారు. పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ కలిగిన వారందరూ అర్హులన్నారు. పోస్టర్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 16న ఉదయం 9 గంటలకు విద్యార్హత ధ్రువపత్రాలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

రేపు ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

ధర్మవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్డీఓ మహేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో అధికారులందరూ పాల్గొనాలన్నారు. ప్రజలు వారి సమస్యలను ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో తెలియజేయాలని పేర్కొన్నారు.

గిరిజన గురుకుల కళాశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం (ప్రెస్‌క్లబ్), ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కదిరిలో ఉన్న తనకల్లు గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు గిరిజన విద్యార్థినులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తనకల్లు ప్రిన్సిపాల్ వెంకట రామానాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి మార్చి 2వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు కదిరిలోని గిరిజన బాలికల పాఠశాల, అనంత జిల్లాలోని గొల్లలదొడ్డి గిరిజన బాలికల పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. గిరిజన విద్యార్థినులు //http://twreis-cet.apcfss.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ : 8309005097, 8309486312, 9989377144కు సంప్రదించాలన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక



హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి హర్షవర్ధన్ జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో హర్షవర్ధన్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..హర్షవర్ధన్ పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్‌లోని వైఎన్ కళాశాలలో ఆదివారం నుంచి జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటారన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

ధర్మవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శాంతి భద్రతలకు అందరూ సహకరించాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, ధర్మవరం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు రేనాటి శ్రీనివాసులు, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, నరేంద్ర, నత్‌కుమార్, శీన, రామకృష్ణ, సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ శాంతిభద్రతలపై అందరి సహకారం కావాలన్నారు.

ఫిర్యాదుల కౌంటర్ ప్రారంభం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్

గాండ్లపెంట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ బి. బాబురావు మూడు ఫిర్యాదుల కౌంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే వారు అర్జీలను ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ. 50 నుంచి వందవరకు చెల్లించి రాయించుకునేవారన్నారు. అలాకాకుండా ఫిర్యాదు దారులకు తమ సిబ్బంది ఆర్జీలను రాయించి పుస్తకంలో నమోదు చేసుకుంటారని తెలిపారు. అనంతరం తమ వద్దకు అర్జీలు పంపుతారన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ, ఆర్ఐలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు 349 మంది విద్యార్థుల గైర్హాజరు

కొత్తచెరువు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నైతిక, మానవ విలువల పరీక్షకు 349 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రఘునాథరెడ్డి, స్పెషలాఫీసర్ చెన్నకేశవప్రసాద్, జిల్లా పరీక్షల నిర్వాహక కమిటీ సభ్యులు సురేశ్‌బాబు, రామరాజు, శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 13,134 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 12,780 మంది హాజరయ్యారని, 349 మంది గైర్హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో భాగంగా నిర్వహించామని వారు తెలిపారు.

నీటి చౌర్యానికి పాల్పడితే క్రిమినల్ కేసులు: ఆర్డీఓ

బత్తలపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కాలువ నీటి చౌర్యానికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ధర్మవరం ఆర్డీఓ మహేష్ హెచ్చరించారు. బత్తలపల్లి, తాడిమర్రి మండలాల నారసింహపల్లి చెరువు పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని మంత్రి సత్యకుమార్ ఆదేశాలు జారీ చేయడంతో శనివారం అధికార యంత్రాంగం కదిలింది. ఆర్డీఓ బత్తలపల్లి మండలంలోని పీఏబీఆర్ కాలువను పరిశీలించారు. మండలంలోని అనంతసాగరం వద్ద ఓ ఆయిల పామ్ యజమాని నీటి చౌర్యానికి పాల్పడ్డారని ఇరిగేషన్ అధికారులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన ఆయిల పామ్ వద్దకు వెళ్లి యజమాని గోపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో కాలువ నీరు వదిలినప్పుడు సొంత అవసరాలకు కాలువ నీటి చౌర్యానికి పాల్పడడమే కాకుండా.. ఆపమని చెప్పిన అధికారులపై ఇష్టానుసారంగా మాట్లాడి భయపెట్టావని, ఇక నీ ఆటలు కట్టిపెట్టాలని, మరోసారి నీటి చౌర్యానికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. కాలువ వెంబడి రెవెన్యూ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని తహసీల్దార్ స్వర్ణలత, ఎస్ఐ సోమశేఖర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ మహేశ్వర్‌రెడ్డి, వీఆర్ఓ, మణి రైతులు పాల్గొన్నారు.



నీటిని అక్రమంగా వాడుతున్న వారిని హెచ్చరిస్తున్న ఆర్డీఓ

పింఛన్లతో వృద్ధులకు భరోసా: ఎమ్మెల్యే



ముత్యాలచెరువులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల మొత్తాన్ని పెంచి వేలాదిమంది లబ్ధిదారులకు అందిస్తోందని, ఇది వారికి భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముత్యాలచెరువు గ్రామంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్న ఆశయంతో పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, టీడీపీ నా యకులు పోగానూరు చెన్నకేశవులు, కుపేంద్రరెడ్డి, గుర్రం తిరుపాల్‌యాదవ్, హరి, శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్



ద్వారాలలో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

గాండ్లపెంట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పలు పంచాయతీలో సర్వర్ పనిచేయకపోవడంతో పింఛన్ల కొంతమేర ఆలస్యమయ్యాయి. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కోసం సిబ్బంది శనివారం ఉదయం 6గంటలకు లబ్ధిదారుల వద్దకు వెళ్లారు. సర్వర్‌మొరాయించడంతో పింఛన్‌దారులు ఎదురు చూడాల్సి వచ్చింది. కటారుపల్లి పంచాయతీ ద్వారా నాల వద్ద పింఛన్ కోసం వృద్ధులు కొంతసేపు వేచిఉన్నారు. అనంతరం సర్వర్ పనిచేయడంతో 95 శాతం పంపిణీచేసినట్లు ఎంపీడీఓ వెంకటరామరెడ్డి తెలిపారు. మిగిలిన పింఛన్లు సోమవారం అందజేస్తామన్నారు.

వైసీపీని వీడను: కేతిరెడ్డి

ధర్మవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దేశంలో కులమతాలతో రాజకీయాలు నడుస్తున్నాయని మాజీ ఎమ్మెల్యేకేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం కేతిరెడ్డి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. కొన్ని రోజులుగా తాను జనసేనలోకి చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. తాను మొదటి నుంచి జగన్ కుటుంబానికి విధేయుడిగా ఉన్నానని తెలిపారు. తాను ఏ పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ సిద్ధాంతాలు వేరు, పవన్ సిద్ధాంతాలు వేరని, తమకు పొంతన కుదరదని అన్నారు. దేశంలోనే కులమతాలతో రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో పీజుల వేధింపులకు విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ విద్యాసంస్థలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

ఘనంగా మార్కండేయ జయంతి



అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మార్కండేయస్వామి జయంతి సందర్భంగా పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందు స్థానిక మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి, గొట్లూరు అనాథాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పుత్తా రుద్రయ్య, జింకా నాగభూషణం, బాలకుళ్లాయప్ప, భాస్కర్, శీన, లక్ష్మీనారాయణ, గంగాధర్, నరేంద్ర, పెద్దిరెడ్డప్ప, గోవిందు, పురుషోత్తమ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అణచి వేయాలి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను అణచివేసే దిశగా విధులు నిర్వర్తించాలని ప్రొబెషనరీ డీఎస్పీ ఉదయపావనికి ఎస్పీ రత్న సూచించారు. 2023 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఉదయపావని శనివారం ధర్మవరం ప్రొబెషనరీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీని కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ధర్మవరం సబ్‌డివిజన్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేయడంతో పాటు మహిళలు చిన్నారులపై జరిగే అఘాయిత్యాలపై దృష్టిసారించాలన్నారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా గౌరవ సలహాదారుడిగా గౌస్‌లాజం



ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ముస్లిం ఐక్యవేదిక గౌరవ సలహాదారుడిగా మండల కేంద్రానికి చెందిన గౌస్‌లాజం ఎంపికయ్యారు. శనివారం తిరుపతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కలీల్‌సయ్యద్, గౌస్‌లాజంను జిల్లా గౌరవ సలహాదారుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా అన్నారు.

రోడ్డు నియమాలను పాటించాలి: ఆర్టీఓ



మాట్లాడుతున్న ఆర్టీఓ శ్రీనివాసులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు రోడ్డు నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని కదిరి ఆర్టీఓ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ప్రమాదం కుటుంబాన్ని ఆర్థికంగా కుంగదీస్తుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ఆటో డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐ రాజేష్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, కరస్పాండెంట్ ఎం. వక్కల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామకృష్ణ, మండ్యం చాంద్‌బాషా, విద్యార్థులు, అధ్యాపకులున్నారు.

బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డీఐ నష్టదాయం



కదిరిఅర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మంత్రి శాఖ నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74శాతం నుంచి వంద శాతానికి పెంచడం బీమా రంగానికి నష్టదాయకమని ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. స్వదేశీ భాగస్వామ్యం కంపెనీ లేకుండా ఓ విదేశీ కంపెనీ భారత దేశంలో నేరుగా ఏర్పాటు కావడం నష్టదాయకం అన్నారు. ఇదే జరిగితే దేశంలో 1956కు ముందు పాలసీ దారులను ముంచేసిన మోసాలు పునరావృతమవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా బీమా రక్షణ విస్తరింప చేసి, పాలసీదారులకు చెల్లింపు బాధ్యతగా, సకాలంలో చేస్తూ దేశాభివృద్ధికి నిధులను అందిస్తున్న ఎల్ఐసీని ఈ నిర్ణయం దెబ్బతీస్తుందని వివరించారు.

న్యూస్ బాక్స్

వంక ఆక్రమణను పరిశీలించిన ఆర్డీఓ



వంక స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

సోమందేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని షిర్డీనగర్‌లో వంకను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్న ఆరోపణలు రావడంతో శనివారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ రెడ్డిశేఖర్, జనసేన, టీడీపీ నాయకులతో కలిసి వంకను పరిశీలించారు. ప్రజాదర్బార్‌లో వర్షపు నీరు గృహాల్లోకి చేరుతోందని స్థానికులు, జనసేననాయకులతో కలిసి మంత్రికి వినతిపత్రాన్ని అందించిన మాట విదితమే. అక్కమ్మగార్ల కొండ నుంచి వైఎస్ఆర్ సర్కిల్‌వరకు ఉన్న వంకను పలువురు ఆక్రమించి నిర్మాణం చేపట్టడాన్ని గమనించారు. కొందరు వంకను పూడ్చివేసి నీరు వెళ్లకుండా అడ్డుకట్టవేసినట్లు నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో వంకను సర్వేచేయించి హద్దులు నిర్ణయిస్తామన్నారు. ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్దలింగప్ప, వడ్డె సూరీ, జనసేన నాయకులు జబీవుల్లా, పేరూరు గంగాధర్, రవికుమార్, వీరమహిళ వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహస్థల సమస్య పరిష్కారం

పరిగి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడేటి గ్రామంలో అంబేడ్కర్ కాలనీవాసులు బస్టాండు సమీపంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎంచుకున్న స్థలాన్ని శనివారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ స్థలంపై సమస్య రావడంతో తహసీల్దార్ హసీనాసుల్తానాకు అంబేడ్కర్ కాలనీవాసులు వినతి సమర్పించారు. ఇతర వర్గీయులు మహాత్మా గాంధీ విగ్రహాన్ని కూడా అక్కడే ఏర్పాటు చేయాలని కోరగా రాజ్యాంగనేత అంబేడ్కర్, గాంధీ విగ్రహాలను వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చిన్నవిగా స్థాపించాలని ఆమె ప్రజలకు సూచించారు. దీంతో ప్రజలు రెండు విగ్రహాల ఏర్పాటుకు సమ్మతిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

పారా అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థులు

పరిగి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి రితీష్ కుమార్, 7వ తరగతి విద్యార్థి సాంబశివ రాష్ట్రస్థాయిలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనున్నట్లు ప్రిన్సిపాల్ మురళిధర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శబానాబాను, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. శనివారం దుర్గా, వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25నుంచి మార్చి 1 వరకు నిర్వహించే మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఆలయానికి విచ్చేసే భక్తాదులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు వీరకేతమ్మదేవి బ్రహ్మరథోత్సవం



ప్రత్యేక అలంకరణలో వీరకేతమ్మదేవి

మడకశిర రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిచెందిన కల్లుమర్రి వీరకేతమ్మదేవి బ్రహ్మరథోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు ,మధ్యాహ్నం 1 గంటకు బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

మున్సిపల్ డీఈ సరెండర్

హిందూపురం, ఫిబ్రవరి,1(ఆంధ్రజ్యోతి): హిందూపురం మునిసిపల్ డిఈ, ఇన్‌ఛార్జి ఎంఈగా విధులు నిర్వహిస్తున్న బాలసుబ్రహ్మణ్యంను పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజనీరింగ్‌కు సరెండర్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయినట్లు మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు తెలిపారు.. హిందూపురం మునిసిపాలిటీలో పని చేస్తున్న డిఈ బాలసుబ్రహ్మణ్యం, కమిషనర్‌ల మధ్య కొంత కాలంగా సఖ్యత లేదు. ఈ విషయాన్ని ఇటీవల హిందూపురం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టి తీసుకెళ్ళారు డిఈ గత వైసీపీ హయాం నుంచి హిందూపురంలో పని చేస్తున్నారు. ఐతే కూటమిప్రభుత్వం వచ్చాక కూడా ఆయన్నే కొనసాగించారు. ఈ తరుణంలో మునిసిపల్ కమిషనర్‌గా సంగం శ్రీనివాసులును నియమించారు. కొన్ని పనుల విషయంలో కమిషనర్, డిఈల మధ్య వివాదం తలెత్తింది. ఇది కాస్త ముదిరి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకునేంత వరకు చేరింది. దీంతో ఇద్దరిలో ఒక్కరినే ఇక్కడ ఉండేలా చూడాలంటూ కమిషనర్ ఎమ్మెల్యేను కోరారు. దీంతో డిఈని మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి తక్షణమే విజయవాడ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ చీఫ్ వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. ఆయన స్థానంలో డిఈగా మోహన్‌ను నియమించినట్లు కమిషనర్ తెలిపారు.

పెనుకొండలో జోరుగా ఇజ్‌తెమా ఏర్పాట్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పెనుకొండలోని రైల్వే స్టేషన్ సమీపంలోని చింతవనంలో ముస్లింల ఇజ్‌తెమా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 5, 6తేదీన హిందూపురం, పెనుకొండ, సోమందేపల్లి, కదిరి, అనంతపురం, లేపాక్షి, చిలమత్తూరు, తదితర ప్రాంతాల నుంచే కాక కర్నాటక నుంచి కూడా ముస్లింలు రానున్నట్లు తెలిపారు. ముస్లింల కోసం వజూ చేసేందుకు, మరుగుదొడ్ల కోసం, స్థలాన్ని శుభ్రం చేస్తూ పనులు వేగంగా చేస్తున్నారు.

ఎక్కడబడితే అక్కడే!

- రోడ్డుపై ఆటోలు, లారీల నిలుపుదల
- పగటి పూటే భారీ వాహనాల నుంచి అన్‌లోడింగ్
- పట్టించుకోని పోలీస్, మున్సిపల్ యంత్రాంగం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):రోడ్డు ఎంత వెడల్పు చేసినా వాహనాలన్నీ రోడ్డులోనే ఆపేస్తే ఏం ప్రయోజనం? హిందూపురంలో ఒకప్పుడు రోడ్లు చాల ఇరుకుగా ఉండేవి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని చోట్ల రోడ్లను విస్తరించారు. రోడ్డు వెడల్పు అయితే చేశారుగాని, రోడ్డుపై వాహనాలు నిలపడం, భారీ వాహనాలు అన్‌లోడ్ చేయడం లాంటి విషయాలను పోలీసులు, మునిసిపల్ అధికారులు గాలికి వదిలేశారు. ఇంకేముంది ఎక్కడి పడితే అక్కడ రోడ్డుకు అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఆటోల గురించయితే చెప్పనక్కరలేదు. పట్టణ వ్యాప్తంగా ఆటోలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. తోపుడు బండ్లు కూడా రోడ్డు మధ్యకు వచ్చి ఆపుతున్నారు. దీంతో పెద్ద వాహనాలు వచ్చినపుడు దారిలేక ట్రాఫిక్ జామ్ అవుతోంది.

లారీలు అన్‌లోడ్ చేయాలంటే రాత్రి 9 గంటల తరువాత పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. అదే విధంగా ఉదయం 8 గంటల లోపు మాత్రమే అన్‌లోడింగ్‌కు అనుమతి ఉంది. ఇలా కాకుండా సమయంతో పని లేకుండా లారీలను రోడ్లపై ఆపి అన్‌లోడ్ చేస్తున్నారు. ముఖ్యంగా సిమెంట్ లారీలు, బియ్యం లారీలను ఈ విధంగా ఎక్కువగా అన్‌లోడ్



బస్టాండ్ రోడ్డులో పగలే లారీల నుంచి అన్‌లోడింగ్ చేస్తున్న దృశ్యం



పరిగిరోడ్డు సర్కిల్‌లో సగం రోడ్డు ఆక్రమించుకొన్న ఆటోలు

చేస్తున్నారు. ఇప్పుడైతే వాతావరణం కాస్త చల్లగా ఉంది. అదే వేసవిలో అయితే ప్రజలు భరించలేని విధంగా ఎండ వేడిమి ఉంటుంది. రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఆపితే ప్రజలు అవస్థ పడాల్సి ఉంటుంది. పోలీసులు అటుగా కన్నెత్తి చూడటంలేదు. కళ్ళముందు వాహనాలు రోడ్డును సగం ఆక్రమించినా పట్టించుకోవడంలేదు. అదేవిధంగా మునిసిపల్ అధికారులు అయితే అటు కన్నెత్తికూడా చూడటంలేదు. కఠిన చర్యలు తీసుకోకపోతే రోడ్లు వెడల్పు చేసినా ప్రయోజనం లేదని ప్రజలు అంటున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : సీఐ, వన్ టౌన్

ప్రజా సౌకర్యమే ముఖ్యం. అలా కాదని ఎవరైనా నిబంధనలకు తూట్లు పొడిచి ఇష్టారాజ్యంగా వ్యవహరించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు. తోపుడు బండ్లు కానీ, ఆటోలు కానీ, రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ నిలిపితే అలాంటి వారిపైన చర్యలు తీసుకుంటాం. పగటి పూట భారీ వాహనాల అన్‌లోడింగ్‌కు అనుమతి లేదు.

రోడ్లపై పార్కింగ్ ఇబ్బందికరం



జమీల్, స్థానికుడు

పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపుతున్నారు. రోడ్డు దాటాలంటే ఇబ్బందికరంగా ఉంది. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అయితే ద్విచక్రవాహనాలు రోడ్డు మధ్యనే ఉంచుతున్నారు. ఆటోల గురించి చెప్పనక్కరలేదు. భారీ వాహనాలు వస్తే ట్రాఫిక్ జామ్ కావాల్సిందే. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి

నిద్రావస్థలోని హాస్టళ్లను వెలుగులోకి తెచ్చాం

- బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిద్రావస్థలో ఉన్న హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించి వాటిని వెలుగులోకి తెచ్చామని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల పునర్నిర్మాణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పెనుకొండ గురుకుల పాఠశాల అభివృద్ధికి తీసుకున్న చొరవపై అధికారులపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఎంజేపీ పాఠశాలలో రూ.50లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని అందులో వారు సొంతంగా రూ.11లక్షలు ఇవ్వగా, మిగిలిన రూ.40లక్షలు దాతలు అందించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 107హాస్టళ్లు ఉండగా 105టీడీపీ పాలనలో నిర్మించినవేనన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యనందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. ఒక్క అవకాశంతో వచ్చిన రంగుల రెడ్డి బడుగు బలహీనవర్గాల పిల్లల చదువుకునే పాఠశాలలను గాలికి వదిలేసినట్లు తెలిపారు. అంతేకాకుండా బీసీ సంక్షేమ మంత్రిగా ఉన్న వైసీపీ శంకర్‌నారాయణ ఇదే పాఠశాలలో ఒకరోజు పూర్తిగా నిద్రపోయి ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారులు, పీఆర్ఈఈ మురళీకృష్ణ, డీఈ వెంకటరమణ, కమిషనర్ సతీష్ కుమార్, నాయకులు కేశవయ్య, మాధవనాయుడు, వెంకటరాముడు, నారాయణస్వామి, రాంపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కందులు కొనుగోలు చేసిన వారంరోజుల్లోపు ఖాతాలో జమ

పెనుకొండ రూరల్ : రొద్దం మండలంలోని చోళేమర్రి గ్రామంలో శని



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

వారం బీసీసంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అత్యధికంగా కందులు సాగుచేస్తున్నారని, వీటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. క్వింటాల్ రూ.7,550తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలుచేసిన వారం రోజుల్లోపే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామన్నారు. అదేవిధంగా ఒక్కో మండలానికి రూ.15లక్షలు విలువచేసే డ్రోన్ పంటలకు మందు పిచికారి చేయడానికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. అలాగే రొద్దంలో మండలంలో 20గోకులం షెడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. వ్యవసాయంతోపాటు అనుబంధ పరిశ్రమపైన తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తుందన్నారు. పల్లె పండగ పేరుతో రూ.6కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

117 జీవోతో విద్యారంగం అస్తవ్యస్తం

పెనుకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అమలు పరిచిన 117జీవో ఫలితంగా విద్యారంగం అస్తవ్యస్తంగా, గందరగోళంగా మారిందని, కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని వెంటనే సరిదిద్దాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మౌర్య రెసిడెన్సీలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. అలాకాకుండా యాప్ పనిభారంతో ఆన్‌లైన్‌లతో సమయాన్ని వృథా చేయిస్తున్నారన్నారు. 3,4,5 ప్రాథమిక పాఠశాలలు కొనసాగాలని అందులో రెండు రకాల పాఠశాలలను 1నుంచి 5, 6నుంచి 10వరకు ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ ఎంతో పోరాటం చేసిందన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తాం

పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని సీ రంగాపురం, ఆర్ అనంతపురం, అయ్యావారిపల్లి గ్రామాల్లో శనివారం వృద్ధులకు పింఛన్లు పంపిణీచేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు అనంతరం సీ.రంగాపురం గ్రామంలో అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీచేశారు. చిన్నారులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో



అయ్యావారిపల్లిలో వృద్ధులకు పింఛన్లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

మండలంలోని ఆర్.అనంతపురం పంచాయితీ కేంద్రంలో ఏపీ మార్కెట్ వారి సహకారంతో ఏడిసిసి బ్యాంక్ వారు కందులు, రాగులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు ప్రారంభించగా, రూ.రూ.40 లక్షలతో నిర్మించిన గోదామును టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం కందులు క్వింటాలుకు రూ. 7550, రాగి రూ.4290 వంతున కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ క్రిష్ణానాయక్,ఏడిసిసి బ్యాంక్ మేనేజర్ సోమశేఖర్,ఎగ్జిక్యూట్ ఆఫీసర్ సురేష్, ఎంపీడిఓ సోనియాబాయి, ఏడీ కృష్ణమీనాన్,ఏఓ తిమ్మప్ప,మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

మడకశిర వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను త్వరితగతిన పూర్తి చేసి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి మడకశిర ఆస్పత్రి నూతన భవన నిర్మాణాలను పరిశీలించారు. మడకశిర ప్రాంతంలో అన్ని రకాల వైద్య సేవలు అందేలా కృషి చేద్దామన్నారు. అనంతరం ఆస్పత్రిని తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకొన్నారు.

టెంపో బోల్తా.. 9 మందికి తీవ్రగాయాలు

పావగడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): టెంపో బోల్తాపడటంతో 9మందికి గాయాలై ఇద్దరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన శుక్రవారం రాత్రి తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడూరు సమీపంలో జరిగింది. కొత్తపల్లి తాండావాసులు తిరుమణి గ్రామంలో ఒక ఇల్లు సెంట్రింగ్ వేయడానికి వెళ్లి పనులు పూర్తిచేసుకుని తిరిగి వస్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తిప్పానాయక్, శాంతాబాయి, అపస్మారకస్థితికి వెళ్లగా లక్ష్మమ్మ, అరుణ, కావేరీ, శాంతమ్మ, ప్రకాశ్‌నాయక్, తీవ్రగాయాల పాలై పావగడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు తిరుమణి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

మంగళవాడ గ్రామంలోని తిరుమల రాఘవేంద్ర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ప్రదీప్ అనే విద్యార్థి జనవరి 8నుంచి కనిపించడంలేదని తండ్రి జయరామప్ప అర్సిగెర పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఆరోజు ఉదయం 7గంటల సమయంలో హాస్టల్‌దగ్గరకు తన స్నేహితులతో కలిసి వస్తానని చెప్పి ఇప్పటికీ రాలేదన్నారు. బెంగళూరు, తుమకూరు తమ బంధువులను విచారించినా ఎక్కడ ఆచూకి తెలియడంలేదని ప్రస్తుతం ఎవరికైనా కనిపిస్తే అర్సిగెర పోలీస్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా తెలుపాలని మనవి చేశారు. అతను వెళ్లిన రోజు ఎర్రచొక్క, సిమెంటురంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. 5అడుగుల ఎత్తు ఉంటాడన్నారు. ఎక్కడైనా ఆచూకి తెలిస్తే అర్సిగెర ఎస్ఐ 9480802978కు సమాచారం అందించాలన్నారు

కర్ణాటక మద్యం ప్యాకెట్ల స్వాధీనం

గుడిబండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుబరపల్లి గ్రామానికి చెందిన జగదీష్ అనే వ్యక్తి నుండి 50 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. కర్ణాటక మద్యం ప్యాకెట్లు గ్రామంలో అమ్మడానికి తరలిస్తుండగా సోదాచేసి పట్టుకొని మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేట్‌కు దీటుగా ఎన్ఎస్‌పీఆర్ కళాశాల

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతుందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరులు పేర్కొన్నారు. పట్టణంలోని సువర్ణభారతి, చిలమత్తూరు, లేపాక్షి జూనియర్ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ తరువాత డిగ్రీలో చేరబోయే విద్యార్థులకు కళాశాల డిగ్రీ విద్యార్థులు అవగాహన కల్పించారు కళాశాలలో సౌకర్యాలు, ఫీజు వివరాలు, అధ్యాపకుల పనితీరు తదితర వివరాలను వివరించారు. కళాశాలలో ల్యాబ్, గ్రంథాలయం, క్రీడల విభాగం, ల్యాంగ్వేజ్‌ల్యాబ్, జెకెసి సెల్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలను చూపించి వివరించారు.

కుంభమేళాకు పురం నుంచి ఆర్టీసీ బస్సులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు హిందూపురం ఆర్టీసీ డిపో నుంచి ఫిబ్రవరి మొదటి వారంలో ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. అయోధ్య, కాశీ, మహాకుంభమేళాలతో పాటు మరిన్ని ప్రాంతాలు దర్శించవచ్చని తెలిపారు. టికెట్ కావలసినవారు ఈ క్రింది ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలన్నారు. వివరాలకు 9440834715, 7382861323లను సంప్రదించాలి.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు



ఎక్సకవేటర్ తొట్టెలో కూర్చుని ఆక్రమణల తొలగింపును అడ్డుకుంటున్న క్రిష్టప్ప

గోరంట్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజాపురం గ్రామంలతో ప్రభుత్వ స్థలంలో నిర్మించినషెడ్‌ను తహసీల్దార్ మారుతి, ఎస్ఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. ఖాజాపురానికి చెందిన రైతు గొల్ల క్రిష్టప్ప పొలం పక్కనే ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నారు. సమీపంలోని అంగన్‌వాడీ సెంటర్ పక్కనే నాలుగుసెంట్ల ప్రభుత్వ స్థలముంది. ఈస్థలం కొన్ని దశాబ్దాలుగా క్రిష్టప్ప అనుభవంలో ఉంటోంది. దీంతో ఇటీవల షెడ్ నిర్మాణం పనులు చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారని, స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవిన్యూ అధికారులు స్పందించారు. నాలుగు సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమించినట్లు నిర్ధారణ కావడంతో నోటీసులు జారి చేసి ఎక్సకవేటర్‌తో అధికారులు అక్రమణలు తొలగించారు. అయితే క్రిష్టప్ప కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలుపుతూ కూల్చివేతలను అడ్డుకున్నారు. వికలాంగుడన్న కనికరం లేకుండా అధికారులు షెడ్‌ను తొలగించి నష్టం కలిగించారని ఆవేదన చెందారు. గ్రామంలో పలువురు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోగా, వారిని పట్టించుకోకుండా తాను నిర్మించుకున్న షెడ్‌ను తొలగించడం దారుణమన్నారు.

సామాజిక తనిఖీలో రూ.97వేలు అవినీతి వెలుగులోకి



సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటప్పను ప్రశ్నిస్తున్న దృశ్యం

అగళి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):అగళి ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సజావుగా జరిగింది. ఈ ప్రజావేదికలో రూ.97వేలు అవినీతికి పాల్పడినట్లు వెల్లడైంది. ఏపీఓ శివన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అడిషనల్ పీడీ శివశంకర్, డీఆర్ఓ రమణారెడ్డి, పీఈ నాగేశ్వర్‌రావు, క్లస్టర్ ఏపీడీ లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ ఉమేష్, ఎంపీడీఓ యాదవేంద్ర పాల్గొన్నారు. ఈ సామాజిక తనిఖీ ఉమేష్ ఎంపీడీఓ యాదవేంద్ర పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 578పనులకు రూ.5,36,62,246 ఖర్చు చేయగా, 13గ్రామ పంచాయతీలలో ఎక్కువ భాగం పండ్లతోటల దగ్గర నేమ్‌బోర్డుల్లేవని సభ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా మస్టర్ లేకుండా బిల్లులు చేసుకున్నట్లు తెలిపారు. పీబ్యాడిగెర రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటినట్లు బిల్లులు చేసుకున్నట్లు వెల్లడైంది. సామాజిక తనిఖీలో ఎస్ఆర్‌పీ రామసుబ్బయ్య, టెక్నికల్ ఇంజనీర్ శ్రీధర్, మండల కన్వీనర్ కుమారస్వామి, తిప్పేస్వామి, కెంచప్ప, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలు పాల్గొన్నారు.

మడకశిరలో మొక్కుబడిగా..

మడకశిర టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు జరిగిన పనులకు సంబంధించి శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం గత 10 రోజులకు పైగా నిర్వహించిన తనిఖీ మొక్కుబడిగా సాగిందని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని 17 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం సంబంధించి బీఆర్, అటవీ, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల కింద రూ.8.75కోట్ల వ్యయంతో 667 పనులు చేశారు. అందుకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం తనిఖీ నిర్వహించారు. ఇందులో కేవలం రూ.19.86లక్షలు అవినీతి జరిగినట్లు, వెంటనే రికవరీ చేయాలని ప్రొసీడింగ్ అధికారి శివశంకర్, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి ఆదేశించారు. ఈసమావేశంలో డ్వామా ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్, ఎంపీడీఓ సోనీబాయి, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పుపై కార్మికుల విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాయకులు

పావగడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల పిల్లల చదువుకు, ఆరోగ్య బీమాకు నిధులు వెంటనే విడుదల చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ కార్మికులు, వారి పిల్లలు శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తాలూకా వ్యాప్తంగా కార్మికులకు ఇచ్చిన గుర్తింపు కార్డులను అధికారులు పరిశీలన చేసి వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని కార్మిక సంఘం అధ్యక్షులు రామాంజినప్ప కోరారు. వితంతువేతన, శిక్ష సహాయ నిధులు వెంటనే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మమత, ఉపాధ్యక్షులు రామాంజినప్ప, హమాలీ సంఘం అధ్యక్షుడు సుబ్బరాయప్ప, మద్దిలేటప్ప తదితరులుపాల్గొన్నారు.